6న 'గద్దర్ పాటపై

తూటా' సభ

ఖైరతాబాద్, ఏప్రిల్ 1: ప్రజాగాయకుడు, దివంగత గద్దర్‌పై కాల్పుల ఘటన జరిగి 27 ఏండ్లు గడిచిన సందర్భంగా గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6న బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో సాయంత్రం 6 నుంచి పాటపై తూటా పేరుతో సభ నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ నిర్వాహకుడు, గద్దర్ తనయుడు సూర్యకిరణ్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ సంగంరెడ్డి పృథ్వీరాజ్‌యాదవ్, డాక్టర్ జిలుకర శ్రీనివాస్‌తో కలిసి కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. సూర్యకిరణ్ మాట్లాడుతూ.. ఈ సభలో ముఖ్యఅతిథులుగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, ప్రొఫెసర్ కంచె ఐలయ్య, జస్టిస్ చంద్రకుమార్, రాజకీయ విశ్లేషకులు డాక్టర్ పరకాల ప్రభాకర్, ఆంధ్రజ్యోతి ఎడిటర్ డాక్టర్ కె.శ్రీనివాస్, సీనియర్ అంబేద్కరిస్ట్ జేబీ రాజు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ప్రజా గాయకురాలు విమలక్క, ప్రజా కవి జయరాజు, ఎంవీ ఫౌండేషన్ అధ్యక్షుడు ఆర్.వెంకట్‌రెడ్డితో పాటు గద్దర్ అభిమాన సంఘం నాయకులు సీఎల్ యాదగిరి, తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు డి.కొండారెడ్డి, సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి.సాగర్, ఎన్.బాలమల్లేశ్ హాజరుకానున్నట్లు తెలిపారు.

మృతదేహం లభ్యం

కంటోన్మెంట్, ఏప్రిల్ 1: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బోయిన్‌పల్లి పోలీసుల కథనం ప్రకారం.. బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ సుచిత్ర ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ సమీపంలో ఓ గుర్తు తెలియని మృతదేహం కనిపించిందని సోమవారం స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.
పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి సంబంధించిన బంధువులు ఉంటే బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిర్దేశించిన ప్రాంతాల్లోనే..

వ్యాపారాలు చేసుకోవాలి

-మోండా మార్కెట్, పాలికా బజార్ చౌరస్తాలో చిరు వ్యాపారులకు సూచించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

మారేడ్‌పల్లి, ఏప్రిల్ 1: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో...నిర్దేశించిన స్థలాల్లో మాత్రమే చిరు వ్యాపారులు తమ తమ వ్యాపారాలు నిర్వహించుకోవాలని, రోడ్ల పైకి వచ్చి పాదచారులు, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చిరు వ్యాపారులే చూసుకోవాలని మాజీ మంత్రి, ప్రస్తుత సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఫుట్‌పాత్ వ్యాపారుల , ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం మోండా మార్కెట్ డివిజన్ లోని పాలికాబజార్‌లో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సోమవారం ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసు అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక చిరు వ్యాపారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లోని పాలికా బజార్, బండిమెట్, మోండా మార్కెట్, ఓల్డ్ జైన్ ఖానా తదితర ప్రాంతాల్లో 40 నుంచి 50 ఏండ్ల నుంచి అనేక మంది పేదలు వివిధ రకాల వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని చెప్పారు. చిరు వ్యాపారాలు నిర్వహించే వ్యాపారులకు కేటాయించిన స్థలాల్లో మాత్రమే వ్యాపారాలు నిర్వహించుకోవాలని, రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకొని వ్యాపారాలు చేస్తే పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకుంటారని చెప్పారు. వ్యాపారులందరూ ఇటు పోలీసులకు, అటు ప్రజలకు, వాహనాదారులకు సహకరించాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ కార్పొరేటర్లు ఆకుల రూప, ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు, సీఐ ఉపశంకర్, మార్కెట్ సీఐ రాఘవేందర్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆకుల హరికృష్ణ, నాగులు, రాములు, శ్రీనివాస్‌గౌడ్, మహేష్ యాదవ్, అమర్, కిశోర్, బబ్లూ, అల్తాఫ్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

మోండా మార్కెట్ లోని పాలికాబజార్ చౌరస్తాలో ట్రాఫిక్ పోలీసు అధికారులు, చిరు వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

ఆలయ అభివృద్ధికి పాటుపడాలి

సికింద్రాబాద్ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థి టీ.పద్మారావు

ఎమ్మెల్యే పద్మారావును కలిసిన సాయిబాబా ఆలయ నూతన కమిటీ సభ్యులు

బన్సీలాల్‌పేట్, ఏప్రిల్ 1 : ఆలయ అభివృద్ధికి పాటుపడుతూ, ఆధ్యాత్మిక వాతావరణం నెలకొల్పడం, భక్తులకు సదుపాయాలను కల్పించడానికి నూతన కమిటీ కృషి చేయాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే టి.పద్మారావు అన్నారు. సోమవారం తన నివాసంలో న్యూబోయిగూడలోని సాయిబాబా మందిరం నూతన కమిటీ అధ్యక్షుడు బి.మహేశ్, సభ్యులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఏకగ్రీవంగ ఎన్నికైన నూతన అధ్యక్షుడు బి.మహేశ్‌ను ఆయన శాలువాతో సన్మానించి అభినందించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.లక్ష్మీనారాయణ, ఉపాధ్యకులు భగత్ శ్రీను, రాగటి సతీశ్, కుమ్మరి శంకర్, ప్రధాన కార్యదర్శి కరుణాకర్ పాండు, కోశాధికారి జీబీ.సాయికృష్ణ, బీఆర్ఎస్ నాయకులు రాజేందర్, జ్ఞాని, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు

న్యూ బోయిన్‌పల్లి కడక్‌పురాలో బోర్‌వెల్‌ను రిపేర్ చేస్తున్న బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి టీమ్ సభ్యులు

కంటోన్మెంట్, ఏప్రిల్ 1: వేసవిని దృష్టిలో ఉంచుకుని ఒకటో వార్డులో నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నట్లు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం న్యూ బోయిన్‌పల్లి కడక్‌పురాలోని మజీద్ హోమర్ వద్ద బోర్‌వెల్ రిపేర్ కావడంతో జక్కుల మహేశ్వర్‌రెడ్డి బోర్‌వెల్ సమస్యను పరిష్కరించారు. స్థానికులు నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న విషయం తన దృష్టికి రావడంతో వెంటనే స్పందించిన జక్కుల తన టీమ్‌ను ఆ ప్రాంతానికి పంపించి దగ్గరుండి పనులు పూర్తి చేయించారు. ఈ సందర్భంగా జక్కుల మాట్లాడుతూ.. నీటి ఎద్దడి రాకుండా అన్ని బస్తీల్లో ప్రత్యేకంగా పర్యటించడం జరుగుతుందని, అవసరమైన చోట బోర్‌వెల్‌లను రిపేర్ చేయిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో ఇక్బాల్ సాబ్, సయ్యద్ ఆరీఫ్, షేక్ రిజ్వాన్, కిశోర్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ట్రాఫిక్ డీసీపీ సుబ్బారాయుడు

తొలగించిన సైలెన్సర్లను ధ్వంసం చేస్తున్న ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారులు

బేగంపేట్, ఏప్రిల్ 1: వింత శబ్దాలతో శబ్ధ కాలుష్యానికి పాల్పడుతున్న వాహనదారులపై ఉత్తర మండలం ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. నెల రోజులుగా నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు నేతృత్వంలో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి అధికంగా సౌండ్ చేసే ద్విచక్ర వాహనదారుల వాహనాలను సీజ్ చేసి సైలెన్సర్‌లను స్వాధీనం చేసుకున్నారు. తొలగించిన సైలెన్సర్‌లను సోమవారం బేగంపేట్‌లోని ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్‌లో పోలీసు అధికారులు ధ్వంసం చేశారు.
సుమారు వెయ్యి సైలెన్సర్‌లను ట్రాఫిక్ డీసీపీ సుబ్బారాయుడు సమక్షంలో ధ్వంసం చేసినట్టు ఏసీపీ శంకర్‌రాజు తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కూడా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

నగరాన్ని స్వచ్ఛతగా ఉంచుదాం

స్వచ్ఛతపై స్థానికులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న యూసీడీ అధికారులు

బన్సీలాల్‌పేట్, ఏప్రిల్ 1 : ఇంట్లో చెత్తను రోడ్లపై వేయకూడదని, ఇంటింటికీ వచ్చి చెత్త సేకరించే రిక్షా కార్మికులకే ఇవ్వాలని జీహెచ్ఎంసీ యూసీడీ అధికారి ఎన్. నర్సింహ అన్నారు. ఈ మేరకు 'స్వచ్ఛత వైపు ఒక అడుగు' కార్యక్రమంలో భాగంగా సోమవారం భోలక్‌పూర్ కృష్ణా నగర్‌లో ఇంటింటికీ వెళ్ళి స్థానికులతో మాట్లాడారు. చెత్త కుండీలు లేని నగరంగా హైదరాబాద్‌ను అభివృద్ధి పరచి, దేశంలోనే బెస్ట్ సిటీ అవార్డు అందుకున్న ఘనత మనదేనని ఆయన తెలిపారు. కానీ, కొందరు తమ ఇంటి చెత్తను రోడ్లపై వేయడం వలన అపరిశుభ్రమైన వాతావరణం నెలకొనడం, రోగాలు వ్యాప్తి చెందడం జరుగుతున్నదన్నారు. ఇకనుంచైనా నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. అనంతరం తమ ప్రాంతాల్లో స్వచ్ఛత పాటిస్తామని ఆయన స్థానికుచే ప్రతిజ్ఞ చేయించారు.

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చీర సత్యనారాయణ

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాంగోపాల్ పేట్ డివిజన్‌కు చెందిన చీర సత్యనారాయణ (శ్రీకాంత్)కు రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్‌గౌడ్ సోమవారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ తనకు భాధ్యత అప్పగించిన రాష్ట్ర నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.
– బేగంపేట్, ఏప్రిల్ 1

బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి

కంటోన్మెంట్ నాలుగో వార్డు గాంధీనగర్‌లో జరిగిన ఇఫ్తార్ విందులో స్థానిక మాజీ బోర్డు సభ్యురాలుతో కలిసి బీఆర్ఎస్ నాయకురాలు నివేదిత పాల్గొన్నారు. మైనార్టీల సంక్షేమం, అభివృద్ధికి గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని, రానున్న మల్కాజిగిరి పార్లమెంట్, కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టితో గెలిపించాలని నివేదిత ముస్లిం ప్రతినిధులను కోరారు. ఈ కార్యక్రమంలో నూర్, సంతోష్, ఆనంద్, విజయలక్ష్మి, మనిషా, సమీనా బేగం, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు. – మారేడ్‌పల్లి, ఏప్రిల్ 1

సనత్‌నగర్ జాయింట్ కన్వీనర్‌గా ఆకుల మహేష్

అమీర్‌పేట్, ఏప్రిల్ 1:సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం బీజేపీ జాయింట్ కన్వీనర్‌గా సీనియర్ నాయకుడు ఆకుల మహేష్ నియమితులయ్యారు. సనత్‌నగర్ బీకేగూడకు చెందిన ఆకుల మహేష్ బీజేపీలో బూత్ స్థాయి నుంచి డివిజన్ యువ మోర్చా, గ్రేటర్, రాష్ట్ర యువ మోర్చా కార్యవర్గ సభ్యుడిగా పని చేశారు. అనంతరం సికింద్రాబాద్ మహంకాళి జిల్లా కార్యవర్గ సభ్యులుగా తన సేవ లందిస్తున్న ఆకుల మహేష్‌ను సనత్‌నగర్ నియోజకవర్గానికి జాయింట్ కన్వీనర్‌గా నియమిస్తూ సోమవారం జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షులు బూర్గుల శ్యామ్ సుందర్‌గౌడ్ నియామక పత్రాన్ని అందజేశారు. తన మీద నమ్మకంతో నియోజకవర్గం జాయింట్ కన్వీనర్‌గా బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షులు బూర్గుల శ్యామ్‌సుందర్‌గౌడ్‌కు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తదితరులకు మహేష్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆటిజాన్ని ప్రారంభ దశలోనే గుర్తించాలి

వ్యవసాయ యూనివర్సిటీ, ఏప్రిల్ 1: మందబుద్ధి గల చిన్నారులను తొలిదశలోనే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకుంటే పెద్ద ప్రమాదమేమీ కాదని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్(ఐఐపీహెచ్) డైరెక్టర్ డాక్టర్ మధుబాల రెంటాల అన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ఐఐపీహెచ్ సమావేశపు మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మానసిక ఎదుగుదల లోపం కారణంగా చాలా మంది పిల్లలు అనేక వ్యాధులబారిన పడుతున్నారు. మంగళవారం ప్రపంచ మంద బుద్ధి(ఆటిజం) నివారణ దినం సందర్భంగా వయస్సుకు తగ్గట్టు పిల్లల్లో రావాల్సిన మానసిక ఎదుగుదల ఉండాలని అన్నారు. ఆటిజాన్ని ప్రారంభంలోనే గుర్తించాలని, నిర్లక్ష్యం చేస్తే జీవితాంతం నాడీ సంబంధిత రుగ్మతగా(న్యూరోలాజికల్ డిజార్డర్)తో బాధపడాల్సి ఉంటుందని చెప్పారు.

విధులను సక్రమంగా నిర్వహించాలి

ట్రైనీ పోలీసులకు బోయిన్‌పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సూచనలు

బోయిన్‌పల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మేడ్చల్ పోలీస్ ట్రైనింగ్ పోలీసులకు సూచనలు చేస్తున్న ఇన్‌స్పెక్టర్ నాగయ్య

కంటోన్మెంట్, ఏప్రిల్ 1: విధులను సక్రమంగా నిర్వర్తించడంతో పాటు బాధ్యతాయుతంగా పోలీసులు వ్యవహరించాలని బోయిన్‌పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగయ్య అన్నారు. ఈ మేరకు సోమవారం మేడ్చల్ పోలీస్ ట్రైనింగ్ కాలేజీ పోలీసులకు బోయిన్‌పల్లిలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఇన్‌స్పెక్టర్ నాగయ్య పలు కీలకమైన సూచనలు చేశారు. విధుల్లో మర్యాద, విధేయతతో పాటు నిజాయితీ, దేశభక్తి, ధైర్యం సహా సమర్థత కలిగి ఉండాలన్నారు. పోలీస్ ట్రైనింగ్ కాలేజీ పోలీసుల శిక్షణలో భాగంగా ఒకరోజు శిక్షణ తరగతులు బోయిన్‌పల్లిలో నిర్వహించారు.
ఈ శిక్షణ తరగతులలో 61 మంది పీటీసీ శిక్షణ పోలీసుల బ్యాచ్ పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు విధులలో ఎలా ఉండాలి, సమాజంలో ప్రజల పట్ల ఎలా వ్యవహరించాలని అనే పలు అంశాలపై సుధీర్ఘంగా వివరించారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే వ్యక్తులతో సాధ్యమైనంత వరకు సామరస్యంగా మాట్లాడి వారిని దారికి తేవాలన్నారు. ప్రజల సంక్షేమాన్ని పోలీసులు ఎప్పుడూ దృష్టిలో ఉంచుకొని వారిపట్ల సానుభూతితో వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై ప్రభాకర్ రెడ్డి, బోయిన్‌పల్లి ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దవాఖానలో గొలుసు చోరీ

- బాధితురాలి ఫిర్యాదుతో కేసు

బంజారాహిల్స్, ఏప్రిల్ 1: కూతురిని దవాఖానకు తీసుకువెళ్లిన సమయంలో బ్యాగులో పెట్టిన బంగారం మాయమైన ఘటన ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఫిలింనగర్‌లోని సిద్ధప్ప హోటల్ సమీపంలో నివాసం ఉంటున్న జె.అశ్విని తన కుమార్తెకు జ్వరం రావడంతో మార్చి 28న షేక్‌పేటలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకు వెళ్లగా అడ్మిట్ చేసుకున్నారు. ఆ సమయంలో తన 3తులాల బంగారు గొలుసును బ్యాగ్‌లో పెట్టుకున్న అశ్విని అదే నెల 30న కుమార్తెను డిశ్చార్జ్ చేయడంతో ఇంటికొచ్చారు. ఇంటికి వచ్చి బ్యాగులో చూడగా గొలుసు కనిపించలేదు. దవాఖానలో తాను వాష్‌రూమ్‌కు వెళ్లినప్పుడు గొలుసు చోరీ అయిందని బాధితురాలు సోమవారం ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పాల ట్రేల చోరీకి యత్నించిన వ్యక్తి అరెస్టు

ఖైరతాబాద్, ఏప్రిల్ 1: షాపు ముందు ఉన్న పాల ట్రేలు ఎత్తుకెళ్లేందుకు యత్నించిన ఓ వ్యక్తి పోలీసులు అరెస్టు చేశారు. పంజాగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ద్వారకాపురికాలనీకి చెందిన వెంకటేశ్ పాల వ్యాపారి. సోమవారం షాపు ముందు ఉంచిన మూడు ట్రేలను గుర్తుతెలియని వ్యక్తి ఎత్తుకెళ్లేందుకు యత్నించాడు. స్థానికులు గుర్తించి అతడిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. విచారణలో బాలానగర్ రాజుకాలనీకి చెందిన దత్తు కుమార్(29)గా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆదర్శంగా తీర్చిదిద్దుతా

బోయిన్‌పల్లిలోని ఆరో వార్డులో బస్తీవాసులతో చర్చిస్తున్న కంటోన్మెంట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీ గణేష్

కంటోన్మెంట్, ఏప్రిల్ 1: రానున్న పార్లమెంట్ ఎన్నికలతో పాటు కంటోన్మెంట్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కంటోన్మెంట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీ గణేష్ ప్రజలను కోరారు. ఈ మేరకు సోమవారం ఆరో వార్డులోని పలు బస్తీల్లో శ్రీ గణేష్ పర్యటించారు. కాంగ్రెస్‌తోనే కంటోన్మెంట్ అభివృద్ధి సాధ్యమని, ప్రభుత్వ పథకాలు సకాలంలో అందాలంటే కాంగ్రెస్‌ను ఆశీర్వదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కంటోన్మెంట్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలంటే అందరి సహకారం ఎంతో అవసరమన్నారు.
కార్యక్రమంలో ఆర్టీసీ మాజీ చైర్మన్ కొత్త సంజీవరెడ్డి, ఏ బ్లాక్ అధ్యక్షులు బద్దం బల్వంత్‌రెడ్డితో పాటు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 1: లోక్‌సభ ఎన్నికల విధుల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్, సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ హేమంత్ కేశవ్‌పాటిల్ అన్నారు. సోమవారం షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో పోలింగ్ ఆఫీసర్స్, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్స్‌కు నిర్వహించిన తొలి విడత శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్స్ ఎన్నికల విధులపై అధికారులకు అవగాహన కల్పించారు. విధుల్లో అలసత్వం ప్రదర్శించవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్వో, యూసుఫ్‌గూడ సర్కిల్ డీసీ సేవా ఇస్లావత్ పాల్గొన్నారు.

శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించి ఏఆర్వో, డీసీ సేవా ఇస్లావతీకు సూచనలు చేస్తున్న ఆర్వో హేమంత్ కేశవ్ పాటిల్

అన్ని రంగాల్లో మహిళలు రాణించాలి

ముగిసిన అంతర్జాతీయ మహిళా వేడుకల్లో వక్తలు

హరిహరకళాభవన్‌లో నిర్వహించిన వేడుకల్లో వివిధ రంగాల్లో రాణించిన మహిళలకు జ్ఞాపికలు అందజేసి సన్మానిస్తున్న పాఠశాల చైర్మన్ శ్రీనివాసరావు

మారేడ్‌పల్లి, ఏప్రిల్ 1: వెస్ట్ మారేడ్‌పల్లి గీతాంజలి స్కూల్ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల ముగింపు కార్యక్రమం సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి వివిధ రంగాల్లో ప్రముఖులైన మహిళలను ఘనంగా సత్కరించారు. పాఠశాల ఆధ్వర్యంలో నెల రోజుల పాటు జరిగిన మహిళా వేడుకలు సోమవారంతో ముగిశాయి. ఈ ముగింపు వేడుకలకు నిజాంపేట మేయర్ నీలా గోపాల్‌రెడ్డి, సోషల్ యాక్టివిస్ ఇందుకూరి నిర్మలాదేవి, అలీప్ ఫౌండర్ ప్రెసిడెంట్ రమాదేవి, కార్పొరేటర్ కొంతం దీపిక, సర్వశిక్ష అభియాన్ మానిటరింగ్ హెడ్ డాక్టర్ కె. బాలకుమారి, ప్రముఖ ల్యాప్రోస్కోపిక్, కొలరెక్టర్ సర్జన్ డాక్టర్ శాంతి వర్ధని, క్లినికల్ సైకాలజిస్ట్ మాధవి, సోషల్ యాక్టివిస్ట్ మంజులత, కూచిపూడి నృత్య కళాకారిణి మృణాలిని తదితరులను సత్కరించి వారు సాధించిన విజయాలు, వాటిని చేరుకోవడంలో పడిన కష్టాలను విద్యార్థులకు వివరించారు.
ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థాపక చైర్మన్ శ్రీనివాసరావు, అకాడమిక్ డైరెక్టర్ వేదకుమారిలు మాట్లాడుతూ...వివిధ రంగాల్లో మహిళలు సాధించిన విజయాలను విద్యార్థులకు తెలియజేసేలా నెల రోజుల పాటు ప్రతి రోజూ ఓ ప్రముఖ మహిళ చేత విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి.

సెక్యూరిటీ గార్డ్స్ అప్రమత్తంగా ఉండాలి

హిమాయత్‌నగర్, ఏప్రిల్ 1: అపార్ట్‌మెంట్లలో విధులు నిర్వహించే సెక్యూరిటీ గార్డ్స్ అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని నారాయణగూడ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ యు. చంద్రశేఖర్ సూచించారు. సోమవారం పీఎస్ పరిధిలో ఉన్న అపార్ట్‌మెంట్లకు ఉన్న సెక్యూరిటీగార్డులతో సమావేశమై భద్రతా పర మైన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ చంద్రశేఖర్, అడ్మిన్ ఎస్సై నరేశ్‌కుమార్ మాట్లాడుతూ.. అపార్ట్‌మెంట్ల లోకి వచ్చే గుర్తుతెలియని వ్యక్తులపై ప్రత్యేక నిఘా పెట్టడంతోపాటు రిజిస్టర్‌లో సమగ్రమైన వివరాలను నమోదు చేయాలన్నారు. అనుమానాస్పదగా ఎవరైనా సంచరిస్తే 100, స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు

బొల్లారం రిసాలబజార్ ప్రభుత్వ పాఠశాలలో డిప్యూటీ ఐఓస్ విజయ్ కుమార్ పదవీ విరమణ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా విద్యాధికారి రోహిణి,డిప్యూటీ ఈఓ బాలునాయక్ హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి,ఉపాధ్యాయ సిబ్బందితో కలిసి విజయ్‌కుమార్‌ని సత్కరించి, ఆయన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. – బొల్లారం,ఏప్రిల్ 1